# గుజరాత్‌కు వలసవెళ్ళిన ఏ.పి.మత్స్యకార్మికుల దుస్థితి

**పాకిస్థాన్** అధీనంలోని అరేబియా సముద్రజలాలలో దారితప్పి చిక్కుకుపోయిన పడవలను పాకిస్థాన్ తీరప్రాంత రక్షకదళం తమ అదుపులోకి తీసుకొని అందులోని 21 మంది మత్స్యకారులను అరెస్టు చేయటంతో తమ జీవనంకోసం ఏ.పి. నుండి గుజరాత్‌కు వలసవెళ్ళిన మత్స్యకార కార్మికుల దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది.

గత చాలా కాలంగా బిజెపి పాలనలోనున్న గుజరాత్ రాష్ట్రం, ఆర్థికంగా అభివృద్ధిచెందిన సంపన్నమైన రాష్ట్రంగా చెప్పబడుతూంటుంది. అయితే, అక్కడ పోగుపడిన సంపదంతా కార్మికుల శ్రమశక్తిని, ప్రత్యేకించి ఇతర రాష్ట్రాలనుండి వలసవచ్చిన కార్మికుల శ్రమశక్తిని, ఘోరంగా దోపిడీ చేయటంపైనే ఆధారపడివుంది.

ఆంధ్రప్రదేశ్ పాలనా యంత్రాంగపు అంచనా ప్రకారం 12 వేలమంది మత్స్యకార కార్మికులు ఏ.పి.నుండి గుజరాత్‌కు వలసవెళ్ళగా, గుజరాత్‌లో శ్రమచేస్తున్న మత్స్యకారుల అంచనా ప్రకారం దాదాపు 30వేలమంది తెలుగు మత్స్యకారులు అక్కడ శ్రమచేస్తున్నారు. వీరితోపాటు తమిళనాడు మరియు ఇతర ఆగ్నేయ రాష్ట్రాలనుండి వచ్చిన అనేకమంది మత్స్యకారులు కూడా ఇక్కడ శ్రమచేస్తున్నారు. అరేబియా మహాసముద్రంలో యంత్రాలతో నడిచే మరపడవల యజమానులవద్ద చేపలవేట వృత్తిగా వీరంతా జీవనం సాగిస్తున్నారు.

తెలుగు మత్స్యకారులలోనూ అత్యధికులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలనుండి వలసవచ్చినవారే. దుర్భర దారిద్ర్యంతోపాటు, బంగాళాఖాతపు సముద్రతీరంలో చేపలవేట సరిగా సాగకపోయిన కారణంగానే, అరేబియా మహాసముద్రతీరంలోని గుజరాత్ రాష్ట్రంలో వెరావల్ కేంద్రంగా వీరు వలసవెళ్ళవలసి వచ్చింది. బంగాళాఖాతం యొక్క తూర్పుసముద్ర తీరమంతా పారిశ్రామిక రసాయనాలు, విషపూరిత పారిశ్రామిక వ్యర్థాలు, కలుషితాలతో నిండిపోయి చేపలు ఇతర సముద్ర చరాల ఉనికికే పెనుప్రమాదంగా తయారైంది; చేపల ఉనికి తగ్గిపోతోంది. దీనితో ప్రత్యామ్నాయ జీవనోపాధి లేక ఉద్యోగావకాశాలు కరవై, యంత్రాలతో నడిచే చేపల పడవలతో కాంట్రాక్టు కార్మికులుగా పని చేసేందుకు మత్స్యకార కుటుంబాలు గుజరాత్ రాష్ట్రానికి వలస వెళ్తున్నాయి.

ఈవిధంగా వలసవెళ్ళిన మత్స్యకార కార్మికులకు నెలకు 12,000 రూ॥ నుండి 14,000 రూ॥వరకు చెల్లిస్తుండగా, యుక్తవయస్సురాని బాలలకు నెలకు 8,000 రూ॥ చెల్లిస్తున్నారు. ఉన్నత నైపుణ్యం కలిగిన ఈ మత్స్యకార కార్మికులు, వెట్టికార్మికులలాగా దుర్భర పనిపరిస్థితులలో, ఘోరమైన జీవనం గడపవలసిన స్థితికి నెట్టబడ్డారు.

గుజరాత్‌లో దాదాపు 8000 వరకు చేపలవేట సాగించే మర పడవలు వుండగా, దాదాపు 100 వరకు చేపల శుద్ధిచేసే పరిశ్రమలు, ఈ పడవల చేపలవేటపై ఆధారపడి వున్నాయి. ఈ మరపడవలు, పడవ యజమానుల ఆధ్వర్యంలో నడపబడుతున్నాయి. ఒక్కో యజమాని 10–15 మరపడవలను స్వంతంగా కలిగివున్నాడు. ఈ మరపడవల వేటద్వారా లభించే చేపలలో అత్యధికభాగం ఇతర దేశాలకు ఎగుమతి చేయటం జరుగుతోంది. దీనివలన దాదాపు మన దేశానికి ఏడాదికి 3 వేల కోట్ల రూ॥విదేశీ మారకద్రవ్యం లభించటంతోపాటు, భారతదేశ మార్కెట్లనుండి 15,000 కోట్ల రూ॥ఆదాయం సమకూరుతోంది.

చేపలవేటకు వెళ్ళిన ప్రతిసారీ, పడవ యజమాని 25 నుండి 30 లక్షల రూ॥లు, కొన్నిసార్లు 50 లక్షల రూ॥వరకు ఒక్కో మరపడవపై ఆదాయం పొందుతున్నాడు. అయితే, మరపడవ ఒకసారి వేటకు వెళ్ళిరావటానికి యజమాని–డీజిల్ ఆయిల్, ఐస్, విధులలోనున్న మత్స్యకారులకు కావలసిన తిండి, సరుకులు మొదలైన వాటిపై నాలుగునుండి ఐదులక్షల రూ॥వరకు ఖర్చుపెడతాడు. ప్రతి విడతకు 8మంది మత్స్యకారుల చొప్పున మరపడవపై పనిచేస్తారు. వీరి జీతభత్యాలకుగాను యజమాని దాదాపు ఒక లక్ష రూ॥ ఖర్చు చేస్తాడు. సగటున ప్రతి పడవపై ప్రతి విడతకు పడవ యజమాని 25 లక్షల రూ॥ సగటు నికరలాభం ఆర్జిస్తున్నాడు.

నెలలో 20–25 రోజులపాటు మత్స్యకారులు ఇంటిని, కుటుంబాన్ని విడిచి సముద్రంపై పడవలో చేపలవేట సాగిస్తూ జీవనం సాగించాలి. వారికి సరైన విశ్రాంతి తీసుకోవటానికి అవకాశమే వుండదు. వారి భద్రత, రక్షణకు ఎలాంటి ఏర్పాట్లూ లేవు. చిన్నపాటి బంకుల్లో గుంపుగా కొద్దిపాటి స్థలంలో వారు నిద్రించాల్సివస్తోంది. పడవపై తాగటానికి మినహా మంచినీటి సౌలభ్యం లేదు కనుక వారికి పడవపై స్నానంచేసే అవకాశం కానీ ఏర్పాటుగానీ లేదు. కనుక వీరంతా దాదాపు 28 రోజులపాటు స్నానంలేకుండా జీవించటానికి నెట్టబడుతున్నారు. ఈ కారణంగా తీవ్రమైన చర్మసంబంధ వ్యాధులతో, ఇతర జబ్బులతో బాధలనుభవిస్తున్నారు. వారికి మల, మూత్రవిసర్జనకు తగిన ఏర్పాట్లేమీ వుండవు; మలమూత్రాలను సముద్రంలోనే మరపడవకు ఒకవైపున వేలాడదీసిన తాడును పట్టుకుని ప్రమాదకర పరిస్థితుల్లో విసర్జించాలి. చేపలవేట పూర్తిచేసుకొని తీరానికి తిరిగివచ్చిన తర్వాత కూడా, వారు విశ్రాంతి తీసుకోవటానికో లేక శలవులను సంతోషంగా గడపటానికో యజమానులు అనుమతించరు. తీరంలో ఆగివున్న పడవలకు చేయవలసిన చిన్నపాటి మరమ్మత్తు పనులకో లేదా తర్వాత విడత వెళ్ళే పడవలలో ఐస్‌నింపే పనిలోనో, పడవలలో కావలసిన రేషన్, ఇతర సరుకులు వుంచే పనిలోనో లేదా పడవకు డీజిల్ నింపే పనిలోనో వుండవలసి వస్తోంది. తీరంలో వున్నప్పటికీ ఈ మత్స్యకార్మికులను వారి తోటి గ్రామస్థులు, మత్స్యకారులతో మాట్లాడటానికి అవకాశమివ్వని విధంగా ఈ

పనులువుంటాయి. సముద్రంలో రెండు పడవలు తటస్థపడినపుడు అవతలిపడవలో నున్న తమ వూరివారితో మాట్లాడటం మినహా ప్రత్యేకించి వారి గ్రామస్థులతో మాట్లాడేందుకు అవకాశమే వుండదు. 8 నెలల కాలంలో, ఒక్కో కార్మికుడు 8 నుండి 10 సార్లు మాత్రమే అది కూడా తీరానికి వచ్చిన తర్వాత మాత్రమే స్నానం చేసే అవకాశముంటుంది. స్నానానికి కావలసిన మంచీనీళ్ళ ఏర్పాటును కూడా ఆ కార్మికులే చేసుకోవలసి వుంటుంది. అనేకమంది మత్స్యకారులు చేపలవేటకోసం వలలు సముద్రంలోకి విసురుతూ, తిరిగి లాగే క్రమంలో ప్రమాదాలు సంభవించి సముద్రంలో పడిపోయి చనిపోయారు. విధులలో వుండి ప్రాణాలు కోల్పోయినప్పటికీ వీరికి ఎలాంటి నష్టపరిహారమూ చెల్లించరు.

మత్స్యకార కార్మికుల భయానక జీవన, పరిస్థితులు ఈ విధంగా వున్నాయి. గుజరాత్ రాష్ట్రప్రభుత్వ పాలనాయంత్రాంగంకానీ, లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ యంత్రాంగంకానీ ఈ మత్స్యకారుల సంక్షేమం గురించి లేదా వారి దుస్థితి గురించి ఏమాత్రం పట్టించుకోవటంలేదు. ప్రభుత్వాల పట్టనితనం, మొండివైఖరులు ఇలా వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 21 మంది మత్స్యకారులను పాకిస్థాన్ తీరప్రాంత రక్షకదళం అరెస్టు చేసిన వార్త ప్రచారమాధ్యమాల్లో, వార్తా కథనాల్లో వెలువడినప్పటినుండి, వారి దుస్థితి గురించి మాధ్యమాల్లో చర్చ జరుగుతూవస్తోంది. గుజరాత్ వలసవెళ్ళిన మత్స్యకారుల సంక్షేమాన్ని తానే కనిపెట్టుకొని వున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నటిస్తోంది. 1988 నుండి గత రెండు దశాబ్దాలుగా వేలాది మంది మత్స్యకార్మికులు వలసలుబోయి, అమానవీయ పరిస్థితులలో పని చేస్తున్నప్పటికీ, ఆ వలసవెళ్ళిన మత్స్యకార్మికుల సంక్షేమంకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఇప్పుడే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళ్ళు తెరిచినట్లుగా, గుజరాత్‌కు వలసవెళ్లిన తెలుగు మత్స్యకార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఓ కమిటీని ఏర్పరుస్తూ హడావుడిగా ప్రకటించింది. ఈ కమిటీ అధ్యయనం చేసి, వారిని తిరిగి మన రాష్ట్రానికి తీసుకొచ్చే విషయమై కొన్ని సిఫార్సులను రూపొందిస్తుంది. పాకిస్థాన్ అరెస్టుచేసిన మత్స్యకారుల విడుదల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న కుటుంబాలను, మత్స్యకారుల సమూహాన్ని మోసగించే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందనేది స్పష్టం. ప్రజాగ్రహాన్నుండి తప్పుకునేందుకు కమిటీలు లేదా కమిషన్లను నియమించటమనేది పాలకులు సాధారణంగా ప్రయోగించే ఎత్తుగడే.

అరెస్టు కాబడిన మత్స్యకారులు విడుదల వటానికి కనీసం 8 నెలలకాలం పట్టేట్లుగా కనిపిస్తోంది. కట్టుబానిసల్లాగా చూడబడ్తోన్న వలస కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కార్మికోద్యమం నిజాయితీతో కూడిన ప్రయత్నాలు చేయాలి.

ooooo